
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 111 | ఆదివారం 9 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 3/-


# అటవీ ఉత్పత్తులకు బ్రాండింగ్

-- ప్రతి గిరిజన కుటుంబానికి 2027 నాటికి సురక్షితమైన తాగునీరు, ఇళ్లు

-- సాధారణ గిరిజన మహిళ ద్రౌపది ముర్ము రాష్ట్రపతి అయ్యారు

-- ద్రౌపది ముర్ము ప్రయాణం ప్రతి పౌరునికి స్ఫూర్తిదాయకం

-- అంతర్జాతీయ గిరిజన దినోత్సవంలో సీఎం చంద్రబాబు









**(అంకుశం, విజయవాడ, ఆగస్టు 9):**
కూటమి ప్రభుత్వం గిరిజన సమాజాల హక్కులు, సంక్షేమాన్ని రక్షించేందుకు కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి గిరిజన కుటుంబానికి 2027 నాటికి సురక్షితమైన తాగునీరు, గృహాలు అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో రోగులను డోలీలలో మోసుకెళ్లే సాంప్రదాయ పద్ధతులపై ఆధారపడకుండా ఫీడర్ అంబులెన్సులు, 108, 104 మొబైల్ వైద్య యూనిట్లు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు సెల్ టవర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. గిరిజన సమాజాలు తమ ఆకాంక్షలను చర్యగా మార్చుకొని, వ్యక్తిగత విజయాన్ని దేశ నిర్మాణంలో భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో అంతర్జాతీయ గిరిజన దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, అవకాశాలు కల్పిస్తే గిరిజన సమాజాలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ అసాధారణ విజయాలు సాధించగలవని నిరూపించాయని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఉదహరిస్తూ, సాధారణ గిరిజన మహిళగా - మిగతా 2లో




# ప్రకాశం బ్యారేజ్‌లో నీటిని పరిశీలించిన సీఎం చంద్రబాబు

-- పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు 17 టీఎంసీల నీరు తరలింపు





**(అంకుశం, అమరావతి, ఆగస్టు 9):**
ప్రకాశం బ్యారేజ్ లో గోదారమ్మ నీటి పరవళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. పట్టి సీమ ద్వారా కృష్ణమ్మకు వస్తున్న గోదావరి నీటిని ముఖ్యమంత్రి తిలకించారు. విజయవాడలో ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొని తిరిగి నివాసానికి వెళుతున్న సమయంలో బ్యారేజ్ పై కొద్దిసేపు తన వాహన కాన్వాయ్ నిలిపిన ముఖ్యమంత్రి గోదావరి నీటితో నిండు కుండలా ఉన్న బ్యారేజ్ ను పరిశీలించారు. గోదావరి నీటితో బ్యారేజ్ నిండుగా ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తోందని సీఎం ఈ సందర్భంగా అన్నారు. పట్టిసీమ ద్వారా ఈ సీజన్ లో ఇప్పటి వరకు 17.52 టిఎంసిల నీటిని కృష్ణా నదికి తరలించినట్లు అధికారులు వివరించారు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాల కారణంగా గోదావరి నది నుంచి ఇప్పటి వరకు 521 టీఎంసీల నీరు సముద్రంలో కలిసినట్లు అధికారులు తెలిపారు. పట్టి సీమ ప్రాజెక్టు ద్వారా సమద్ధిగా గోదావరి జలాలు వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజి దిగువన వివిధ కాలువల ద్వారా డెల్టాలోని పంటలకు నీటిని విడుదల చేస్తున్నామని సీఎం అన్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి 3928 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ నుంచి 3115 క్యూసెక్కులు, గుంటూరు చానల్ నుంచి 115 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డెల్టాకు నీటి సరఫరా కోసం మొత్తం కాలువలకు 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. ఎల్ నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పట్టిసీమ నీరు పంటలకు జీవం పోస్తోందని ఈ సందర్భంగా సీఎం అభిప్రాయ పడ్డారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా ఎల్ నినో పరిస్థితుల్లో సాగునీటి ఇబ్బందుల్ని అధిగమించేందుకు అన్ని విధాలా పనిచేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

# తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ

- ఆక్టోపస్ బిల్డింగ్ వరకు క్యూలైన్లు
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల భారీ రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి బయటకు చేరిన క్యూలైన్లు
- గోగర్భం డ్యామ్ సర్కిల్ వద్ద ఆక్టోపస్ భవనం వరకు బారులు
- సర్వదర్శనానికి 20 నుంచి 24 గంటల నిరీక్షణ
- ఒక్కరోజే రూ.4.13 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం



# క్రికెట్ క్రీడకువరం మంచో ఫెర్రర్ ఆర్డిటి

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను గుర్తించడం ఆర్డిటి లక్ష్యం

ఫాదర్ ఫెర్రర్ హై స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత రోటరీ పురం జట్టు

రన్నర్స్ గా వాణి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ జట్టు

ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి




**బుక్కరాయ సముద్రం అంకుశం న్యూస్ ఆగస్టు 9**
అనంత జిల్లా క్రికెట్ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఆర్డిటిమంచో ఫెర్రర్ క్రీడాకారులకు ఒక వరం అని జిల్లా నుంచి ఎందరో రాష్ట్రస్థాయి జాతీయ అంతర్జాతీయ క్రికెటర్లను తయారు చేయడంలో నిరంతరం కృషి చేస్తూ నేటి యువతకు స్ఫూర్తి నింపుతున్నఆర్డిటి జిల్లా అభివృద్ధికి చేస్తున్న కృషి వెలకట్టలేనిదని ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మచ్చ రామలింగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం బుక్కరాయసముద్రం ఆర్డిటి స్టేడియం నందు మూడు రోజులపాటు జరిగిన క్రికెట్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. మండలంలోని పది ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్ విద్యార్థులు 10 టీములు పాల్గొన్నారు. వాణి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ పై రోటరీ పురం హై స్కూల్ 10 రన్నుల తేడాతో - మిగతా 2లో



# ప్రగతిశీల శక్తులకు స్ఫూర్తి క్యూబా



24వ అంతర్జాతీయ కమ్యూనిస్టు, కార్మిక పార్టీల సమావేశంలో సీపీఐ జాతీయ సమితి కార్యదర్శి కామ్రేడ్ కె రామకృష్ణ

**అంకుశం ప్రతినిధి అమరావతి, ఆగస్టు 9:** క్యూబా విప్లవం ప్రపంచంలోని కమ్యూనిస్టు, ప్రగతిశీల శక్తులకు నిరంతర స్ఫూర్తినిస్తోందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. క్యూబాలో జరుగుతున్న 24వ అంతర్జాతీయ కమ్యూనిస్టు, కార్మిక పార్టీల సమావేశంలో ఆయన సీపీఐ తరఫున ప్రసంగించారు. క్యూబా కమ్యూనిస్టు పార్టీకి, క్యూబా ప్రజలకు, సమావేశానికి హాజరైన అన్ని కమ్యూనిస్టు, కార్మిక పార్టీల ప్రతినిధులకు ఆయన విప్లవ అభివాదాలు తెలిపారు. ఆరు దశాబ్దాలకు పైగా అమెరికా సామ్రాజ్యవాద ఒత్తిళ్లు, ఆంక్షలను ఎదుర్కొంటూ సోషలిజాన్ని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుతున్న క్యూబా ప్రజల ధైర్యం, త్యాగాలను ఆయన అభినందించారు.

2026లో మహానేత ఫిడెల్ కాస్ట్రో శతజయంతిని జరుపుకోబోతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రత్యేక చారిత్రక ప్రాధాన్యత ఉందని రామకృష్ణ పేర్కొన్నారు. ఫిడెల్ కాస్ట్రో కేవలం క్యూబాకు చెందిన నాయకుడు మాత్రమే కాదని, ప్రపంచంలోని అన్ని ప్రగతిశీల ప్రజలకు చెందిన గొప్ప అంతర్జాతీయవాది, మార్క్సిస్టు-లెనినిస్టు, సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవ నాయకుడని అన్నారు.

క్యూబా విప్లవం విద్య, వైద్యం, శాస్త్ర సాంకేతిక రంగం, బయోటెక్నాలజీ, సామాజిక న్యాయం వంటి రంగాల్లో సాధించిన విజయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. ఆర్థిక దిగ్బంధనం వంటి తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో కూడా క్యూబా తన ప్రజలకు ఉచిత వైద్యం, సార్వత్రిక విద్య, సామాజిక భద్రతను అందించడం సోషలిజం శక్తిని నిరూపిస్తోందన్నారు.

ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా తదితర ప్రాంతాల్లో విముక్తి ఉద్యమాలకు క్యూబా అందించిన సహకారాన్ని ఆయన గుర్తుచేశారు. క్యూబా వైద్యులు, ఉపాధ్యాయులు ప్రపంచంలోని అనేక దేశాల్లో అందించిన సేవలు అంతర్జాతీయవాదానికి గొప్ప ఉదాహరణగా నిలిచాయని చెప్పారు.

ప్రపంచ శాంతికి సామ్రాజ్యవాదం ప్రధాన ముప్పు

ప్రస్తుతం ప్రపంచం తీవ్ర రాజకీయ, ఆర్థిక, సైనిక అస్థిరతను ఎదుర్కొంటోందని రామకృష్ణ అన్నారు. అమెరికా, దాని మిత్రదేశాల ఆధిపత్య రాజకీయాలు, సైనిక జోక్యాలు, ఏకపక్ష ఆంక్షలు, వాణిజ్య యుద్ధాలు, ఆయుధీకరణ ప్రపంచ శాంతికి ముప్పుగా మారాయని విమర్శించారు. నాటో విస్తరణ, సైనిక కూటముల బలోపేతం, ఆయుధ పోటీ వల్ల మానవాభివృద్ధికి వినియోగించాల్సిన భారీ వనరులు యుద్ధ సన్నాహాలకు మళ్లుతున్నాయని అన్నారు.

పాలస్తీనా, ముఖ్యంగా గాజాలో కొనసాగుతున్న మానవతా విషాదంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనా ప్రజల న్యాయబద్ధమైన జాతీయ హక్కులకు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని, తూర్పు జెరూసలెంను రాజధానిగా చేసుకుని స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడాలని డిమాండ్ చేశారు.

పశ్చిమాసియాలో ఇరాన్‌పై జరుగుతున్న సైనిక దాడులు, ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత విస్తృత యుద్ధానికి దారితీయవచ్చని ఆయన హెచ్చరించారు. దేశాల మధ్య సమస్యలను సైనిక బలంతో కాకుండా చర్చలు, దౌత్యం, పరస్పర గౌరవం, సార్వభౌమత్వానికి విలువనిస్తూ పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.

భారత్‌లో మతతత్వం, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం

భారతదేశంలో సీపీఐ నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ, నిరుద్యోగం, కార్మికులు, రైతుల హక్కులపై దాడులకు వ్యతిరేకంగా పోరాడుతోందని రామకృష్ణ తెలిపారు. అదే సమయంలో భారత రాజ్యాంగంలోని లౌకిక, ప్రజాస్వామ్య విలువలను, సామాజిక న్యాయాన్ని పరిరక్షించేందుకు కట్టుబడి ఉందన్నారు.

"క్యూబా విప్లవం వర్ధిల్లాలి, శ్రామిక అంతర్జాతీయవాదం వర్ధిల్లాలి, కమ్యూనిస్టు-కార్మిక పార్టీల ఐక్యత వర్ధిల్లాలి" అని నినదిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# మౌలిక వసతులు, విద్య, వైద్యానికి పెద్దపీట

-మొదటిపేజీ తరువాయి

ఆమె స్ఫూర్తితో గిరిజన యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. జాతీయ జెండాతో పాటు మీ అజెండా కూడా ఉండాలని పిలుపునిచ్చారు.

"సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. ద్రౌపది ముర్ము, అబ్దుల్ కలాం, బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, నరేంద్ర మోదీ వంటి మహనీయులంతా సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. 'నేను ఏంటి? ఎలా ఎదగాలి? ఈ సమాజానికి, దేశానికి నేనేం ఇవ్వాలి?' అనే లక్ష్యంతో పనిచేయాలి. మీ విజయం దేశ విజయమవుతుంది.." అని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తిని వ్యాపింపజేసేందుకు ఆగస్టు 9 నుంచి 15 వరకు 'అనే నేను' పేరుతో ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్.. అరకు కాఫీ ఒక సక్సెస్ స్టోరీ**

గిరిజన ప్రాంతాల్లోని ఆర్థిక స్వావలంబనపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాను 25 ఏళ్ల క్రితం ఒక చిరు ప్రయత్నంగా ప్రారంభించిన అరకు కాఫీ, నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచడాన్ని ఆయన గుర్తుచేశారు. "అరకు కాఫీకి నేనే పేరు పెట్టాను. దానిని మార్కెటింగ్ చేసి, ప్రధాని నరేంద్ర మోడీ నుంచి ఆస్ట్రేలియా ప్రధాని వరకు బహుకరించి, గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టాను. ఇవాళ పారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాళ్లు ఉన్నాయి" అని గర్వంగా ప్రకటించారు.

ఇదే స్ఫూర్తితో సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లం వంటి స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించి, బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

గిరిజన ప్రాంతాల్లోని రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సంస్థలతో 19 అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు.

**మౌలిక వసతులు, విద్య, వైద్యానికి పెద్దపీట**

గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నాలుగు కీలక రంగాలపై దృష్టి పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, ఆదాయ మార్గాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మౌలిక వసతులు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో 2,336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. 'జల్ జీవన్ మిషన్' కింద 2027 డిసెంబర్ నాటికి ప్రతి గిరిజన ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాలకు సైతం టెలికాం కనెక్టివిటీ అందించి, డోలీ మోతలు లేని సమాజాన్ని నిర్మిస్తామన్నారు. విద్య: 'తల్లికి వందనం' కింద 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులకు రూ.650 కోట్లు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. విశాఖలోని మేకవారిపాలెంలో 600 మంది విద్యార్థులతో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేసి, ఐఐటీ వంటి జాతీయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా కనీసం 100 మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించడమే లక్ష్యమన్నారు.

వైద్యం: పాడేరులో మెడికల్ కాలేజీతో పాటు పార్వతీపురం, రంపచోడవరం, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. 'సంజీవిని' ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తామని, సికిల్ సెల్ అనీమియా బాధితులకు రూ.10,000 పింఛను అందిస్తూ, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రకటించారు.

**జీవో నెంబర్ 3 పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం**

గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానికులకే దక్కాలనే ఆశయంతో ఎన్టీఆర్ హయాంలో పురుడుపోసుకుని, తాను 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ను కాపాడతామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టులో ఈ జీవోను కొట్టివేయడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. "ఈ జీవోను చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా నిలబడేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తాం. ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆవేశంతో కాకుండా ఆలోచనతో, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై ముందుకు వెళతాం" అని భరోసా ఇచ్చారు.

గిరిజన ప్రాంతాలను కేవలం వెనుకబడిన ప్రాంతాలుగా కాకుండా, అపార అవకాశాలున్న ప్రాంతాలుగా చూస్తున్నామని, అక్కడి పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఉపయోగించుకుని టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి గిరిజన ఇల్లు 'అతిథి గృహం'గా మారాలని, తద్వారా ప్రపంచానికి ఆతిథ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్రప్రదేశ్' లక్ష్యాలను సాధించడంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించాలని, వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## క్రికెట్ క్రీడకువరం మంచో ఫెర్రర్ ఆర్డిటి



-మొదటిపేజీ తరువాయి

ఫైనల్లో గెలిచింది. ఈ క్రీడలలో ప్రతిభ కనబరిచిన బెస్ట్ బౌలర్ బెస్ట్ బ్యాట్స్మెన్ కు బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫాదర్ ఫెర్రర్ ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకు ఆర్డిటి ఇలాంటి క్రీడలను ఏర్పాటు చేస్తుందన్నారు. విద్యార్థి దశలో విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో ఉప యోగపడుతయన్నారు. రోటరీ పురం హై స్కూల్ జట్టు వాణి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ పై 10 రన్నుల తేడాతో ఫైనల్ లో గెలిచిందన్నరు. క్రీడాకారులు గెలుపు ఓట ములను సమానంగా తీసుకోవాలన్నారు. గతంలో క్రికెట్లో రాణించాలంటే ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. ప్రస్తుతం ఆర్డిటి జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి రాష్ట్ర దేశ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తుందన్నారు. నైపుణ్యం ఉన్న క్రీడాకారుడు తప్పకుండా క్రీడల్లో రాణిస్తారన్నారు. క్రికెట్లో ప్రతిభను కనబరిచిన క్రీడాకారులకు తప్పకుండా ప్రతిఫలం లభిస్తుందన్నారు. ఎలాంటి రాజకీయాలకు క్రికెట్లో జోక్యం ఉండదన్నారు ఈ కార్యక్రమంలో ఆర్డిటి పాఠశాల మేనేజర్ గీత క్రికెట్ కోచ్ వెంకటేష్ రోటరీ పురం హై స్కూల్, వాణి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 'బోనాలకు ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయలేదు'

-మొదటిపేజీ తరువాయి

నాయకులు ఆలోచించండి. హిందువులు నిధుల కోసం ప్రభుత్వం దగ్గర బిక్షం ఎత్తుకోవాల్సిన రోజు వచ్చింది. లాల్ దర్వాజా బోనాలకు ప్రభుత్వం కేవలం ఐదు లక్షల నిధులు మాత్రమే ఇచ్చింది. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం. 2029లో వచ్చేది మా ప్రభుత్వమే' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా' కొత్త శక్తినిచ్చింది

చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య సంగ్రామానికి కొత్త శక్తిని అందించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఉద్యమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. వారి ధైర్యసాహసాలు, త్యాగాలు రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ప్రధాని పేర్కొన్నారు. ఆగస్టు విప్లవంలో పాల్గొన్న నేతలను, సమరయోధులను స్మరించుకుంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "మహాత్మా గాంధీ నాయకత్వ స్ఫూర్తితో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం మన స్వాతంత్ర్య పోరాటానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. వలస పాలన నుంచి విముక్తి పొందాలన్న మన ప్రజల అచంచల సంకల్పాన్ని ఇది ప్రతిబింబించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ స్మరించుకుంటున్నాను. వారి ధైర్యం ప్రతి భారతీయుడికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే" అని మోదీ తన సందేశంలో తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా క్విట్ ఇండియా ఉద్యమకారులకు నివాళులర్పించారు. ఈ ఉద్యమం దేశప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిందని, 'డూ ఆర్ డై' (చేయండి లేదా చావండి) అనే సంకల్పాన్ని, అద్వితీయమైన ధైర్యాన్ని వారిలో నింపిందని ఆయన గుర్తు చేసుకున్నారు. జాతి ప్రయోజనాలకు ప్రథమ స్థానం ఇస్తూ, స్వదేశీని ప్రోత్సహిస్తూ ఆత్మనిర్భర్, వికసిత భారత్ లక్ష్యాల కోసం పనిచేయడానికి ఈ రోజు స్ఫూర్తినివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం ఉద్యమకారుల ధైర్యాన్ని, త్యాగాలను స్మరించుకున్నారు. 'డూ ఆర్ డై' నినాదంతో సమరయోధులు జాతీయ చైతన్యాన్ని రగిలించి స్వాతంత్ర్య పోరాటానికి ఒక నిర్ణయాత్మక దిశను చూపారని ఆయన పేర్కొన్నారు. 1942 ఆగస్టు 8న బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడు మహాత్మా గాంధీ 'డూ ఆర్ డై' అనే చారిత్రాత్మక పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలన అంతం కావాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కఠినంగా అణిచివేసినప్పటికీ, దేశవ్యాప్తంగా నిరసనలు, సమ్మెలు వెల్లువెత్తాయి. భారత స్వాతంత్ర్య పోరాట తుది దశలో ఇది ఒక మహోద్యమంగా నిలిచింది

## అటవీ ఉత్పత్తులకు బ్రాండింగ్

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభమై ఒడిశాలో మంత్రి, గవర్నర్‌గా, చివరకు దేశంలోని అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిష్టించిన ఆమె ప్రయాణం ప్రతి పౌరునికి స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో సమాజానికి, దేశానికి తాము ఏమి అందించగలమో అని ప్రశ్నించుకోవాలని ముఖ్యమంత్రి ప్రజలను కోరారు.

రాష్ట్రంలోని 27.39 లక్షల గిరిజనుల సమగ్ర అభివద్ధికి ప్రభుత్వం రూ. 4,764 కోట్లు కేటాయించిందని ముఖ్యమంత్రి తెలిపారు. జీవన ప్రమాణాలు, మౌలిక వసతులు, ఉపాధి, జీవనోపాధులు, నైపుణ్యాభివద్ధి మెరుగుపరచేందుకు ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల (ఐటీడీఏల) ద్వారా ప్రత్యేక దష్టి సారించారు. 2,336 గిరిజన గ్రామాలకు మిషన్ మోడ్‌లో రహదారి సౌకర్యం కల్పిస్తున్నారు. 'అడవి తల్లి బాట' పథకం కింద 905 కిమీ రోడ్లు రూ. 1,000 కోట్ల వ్యయంతో నిర్మించారు.

25 సంవత్సరాల క్రితం అరకు కాఫీని ప్రధాన బ్రాండ్‌గా మార్చేందుకు పునాది వేశామని, ఇప్పుడు అది ప్రపంచ బ్రాండ్‌గా ఎదిగిందని ముఖ్యమంత్రి అన్నారు. మరో లక్ష ఎకరాల్లో కాఫీ సాగును ప్రోత్సహిస్తూ, ఏజెన్సీ ప్రాంతాలను కాఫీ, మిరియాలు, పసుపు వంటి వాణిజ్య పంటలకు ప్రధాన బ్రాండ్ గమ్యస్థానంగా మార్చేందుకు కషి చేస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే అటవీ ఉత్పత్తులకు విలువ జోడింపు చేసి, ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్, బ్రాండింగ్ వరకు మొత్తం గొలుసుకు మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బరు, పార్వతీపురం అనాస, తేనె, తాటి బెల్లం వంటి ఉత్పత్తులకు మెరుగైన ప్రాసెసింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ మద్దతు అందిస్తారు. గిరిజన యువతకు అవకాశాలు విస్తరించేందుకు ప్రభుత్వం సంకల్పించిందని ముఖ్యమంత్రి అన్నారు. 1.5 లక్షల మంది గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి, జీవనోపాధి అవకాశాలు అందించనున్నామని ప్రకటించారు. పోటీ పరీక్షలకు గిరిజన విద్యార్థులను సిద్ధం చేసేందుకు ప్రత్యేక కషి చేస్తారు. ఈ సందర్భంగా సంతకం చేసిన 19 ఎంఓయూలు సుమారు 60,000 మందికి ప్రయోజనం చేకూర్చి, అదనపు జీవనోపాధి, అభివద్ధి అవకాశాలు కల్పిస్తాయని చెప్పారు. గిరిజన సమాజాలపై ప్రత్యేక దృష్టి సారించి మూడు జిల్లాలు ఏర్పాటు చేసి, వారికి అధిక పరిపాలనా ప్రాధాన్యత ఇచ్చామని సీఎం చంద్రబాబు అన్నారు.

## నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు..

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, "వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు," "మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకో త్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదా యంగా వస్తోంది. కాగా, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు టిస్ తర్వాత నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

## తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ..

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు బయటకు విస్తరించాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు కిలోమీటర్ల మేర బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు. నిన్న (ఆగస్టు 8) మొత్తం 87,658 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.13 కోట్లుగా నమోదైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు 4.15 లక్షల లడ్డూలను విక్రయించగా, 3.09 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు. వారాంతం కావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగినట్లు తెలుస్తోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తూ రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ రద్దీ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది.

## నిందితులను అరెస్ట్ చేశాం.. ప్రియాంక కుటుంబానికి న్యాయం చేస్తాం

వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టిన ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీతో ఆమె ఫోన్‌లో మాట్లాడి దర్యాప్తు పురోగతి, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం మంత్రి అనిత.. బాధితురాలు ప్రియాంక తండ్రి వెంకటేశ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆయనకు ధైర్యం చెప్పి, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు వేగంగా స్పందించారని, నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని మంత్రి తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తును వేగవంతం చేసి, చట్టప్రకారం దోషులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగేలా చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ఆమె హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి పూర్తిస్థాయిలో అండగా నిలుస్తామని హోంమంత్రి పునరుద్ఘాటించారు.

## నగరంలో వద్దు... గ్రామంలోనే ముద్దు

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబో తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# పుట్టపర్తిలోరేపు 10 న రేవెన్యు భవన్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

అర్జీల పరిష్కార సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు

జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్



**అంకుశం న్యూస్ పుట్టపర్తిఆగస్టు 9:** శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో గల రెవెన్యూ భవన్ (ఎస్.ఆర్. శంకరన్ హాల్) లో రేపు జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుంది.ప్రజలు ఈ మార్పును గమనించి సంబంధిత వేదికకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ నెల 10న సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా రేవెన్యు భవన్కు వచ్చే అవసరం లేకుండా "ఎవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ" లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చున్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీలలో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. రేవెన్యు భవన్లో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సంకల్పంతో గిరిజనులు ఎదగాలి...





ప్రతి ఒక్కరూ తమ పిల్లలను విద్యావంతులుగా చేయాలి...

జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

గిరిజన సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం...

ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప

**అంకుశం న్యూస్అనంతపురం, ఆగస్టు 9 :** గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, గిరిజనులు మంచి సంకల్పంతో అలాగే ఎదగాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబం లోనితమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దే విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని గిరిజన భవన్ లో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప, రాష్ట్ర ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు సభావత్ సోమ్లా నాయక్ పాల్గొన్నారు. అలాగే వివిధ గిరిజన సంక్షేమ, అభివృద్ధి సంఘాల ప్రతినిధులు, గిరిజన గురుకుల పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, పలువురు గిరిజన మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తొలుత ప్రపంచ ఆదివాసి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ 1994 "సం" డిసెంబర్ 23న ఆదివాసుల హక్కుల పరిరక్షణ కొరకు అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవంను ప్రతి సంవత్సరం ఆగస్టు 9వ తేదీన నిర్వహించాలని ఐక్యరాజ్యసమితిలోని మానవ హక్కుల మరియు రక్షణ సబ్ కమిషన్ తీర్మానించి ఆమోద ముద్ర వేసిందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాలలోని ఆదివాసుల మానవ హక్కుల పరిరక్షణ పర్యావరణం అభివృద్ధి విద్యా మరియు వైద్య రంగాలలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి సహకారం అందించడమే అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవ ముఖ్య ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు అనేకసంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న నేపథ్యంలో అర్హులందరూ వాటిని ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఎవరో వస్తారు, ఏదో చేస్తారని వేచిచూడకుండా ఒక సంకల్పంతో గిరిజనులు ఎదగాలని అన్నారు. తమ పిల్లలను మంచి విద్య బోధనలు నేర్పించి వారు ఉన్నత స్థాయికి వెళ్లడానికి దోహదపడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, ఆహారం, దుస్తులు తదితర సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన గిరిజన సమాజం అర్జీలసమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలు కృషి చేస్తున్నాయని తెలిపారు. అలాగే ఎస్టీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా బాల్యవివాహాల నిర్మూలనకు ప్రభుత్వానికి సహకరించాలని, క్షేత్రస్థాయిలో ఆయా గిరిజన ప్రాంతాల గ్రామాలలో ఉత్సవ వేడుకలు జరిగినప్పుడు గ్రామ దేవత సమక్షంలో బాల్య వివాహాలు జరిపించమని ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞను పూనుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా గిరిజనలు అంటే ఒక ప్రత్యేక భావన ఉంటుందని, వారందరికీ కూడా ప్రత్యేకమైన కట్టుబాట్లు, ఆచారాలు, అలవాట్లు ఉంటాయని, ఇక్కడున్న వారందరికీ ఒక ప్రత్యేకత ఉంటుందని, మీరు చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించిన మీతో పాటు మీ సాంప్రదాయాలను కట్టుబాట్లను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చదువుతున్న పిల్లలు ఎంతమంది ఉన్నా వారందరికీ తల్లికి వందనం పథకం ద్వారా ఏడాదికి రూ.15000 మంజూరు చేస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అలాగే గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు, స్కిల్ డెవలప్మెంట్, ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అవసరాలను గుర్తించి గిరిజన ప్రజల సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రైతులకు ప్రభుత్వం 100 శాతం రాయితీతో మరియు 10 ఎకరాల్లోపు ఉన్న ఇతర రైతులకు 90% రాయితీతో ఏపీఎంఐపి ద్వారా సూక్ష్మ సేద్య పరికరాల మంజూరు చేస్తున్నదని చిన్న, సన్న కారు పెద్ద కారు రైతులకు 50 శాతం రాయితీతో స్ప్రింకర్లను అందిస్తున్నట్లు తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామకాలు జరిగాయని అర్హులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం అమలవుతున్నదని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం, ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన పెంపొందించుకొని లబ్ధి పొందాలని సూచించారు.

నిరుద్యోగులైన బి.ఈ.డి, టిటిసి చేసిన గిరిజన యువతి యువకులకు ఉచితంగా డీఎస్సీ 2024 కోచింగ్ ఇవ్వడం జరిగిందని జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు. అటవీభూములు సాగులో ఉన్న గిరిజన రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు, గిరిజన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసులు అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ప్రభుత్వ చట్టాల పైన గిరిజనులకు అవగాహన ఉండాలని ఆదివాసుల జీవన విధానం సమాజానికి ఆదర్శం కావాలని అలాగే సాంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాలని తెలిపారు.

ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి సంస్కృత పరిరక్షణ కోసం కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి కుష్బూ కొఠారి, ప్రిన్సిపాల్ లు మసూద్ వలి, ప్రవీణ్ కుమార్, కేశవ నాయక్, జిల్లా డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సాకే ముసలయ్య మోహన్ మరియు గిరిజన సంఘాల నాయకులు పోలా మహేష్, సాకే వీరాంజనేయులు, మహేష్ నాయక్ బంజారా సంగ అధ్యక్షులు శివ శంకర్ నాయక్, అశ్వర్థ నాయక్, శ్రీమతి కావేటి ఉమా మహేశ్వరీ, సాకే ముసలయ్య, మల్లికార్జున నాయక్, ముత్యాలమ్మ, రవి కుమార్ నాయక్, పాల్యా రామాంజనేయులు నాయక్, రాజేష్ నాయక్, పామిడి రమేష్ నాయక్, సురేష్ నాయక్, సాకే గాయత్రి , తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం...

జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అంకుశం న్యూస్అనంతపురం, ఆగస్టు 9** ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా స్థానిక గిరిజన భవన్ నందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి వెంకటప్పతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం వల్ల ప్రాణదానం కలుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాలు పైబడి నుండి 50 కేజీల బరువు ఉండి12 శాతం హేమో గోబిన్ కలిగిన ఎవరైనా మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునని తెలిపారు. రక్తదానం పట్ల ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని సూచించారు. రక్తదానం చేసే వారికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సుమారు రూ.3 లక్షల వరకు ప్రమాద ఇన్సూరెన్స్ సదుపాయం కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తం అవసరం ఉన్నవారికి ఇలాంటి శిబిరాల ద్వారా రక్తం ను సేకరించి ఆస్పత్రులలో అవసరం ఉన్నవారికి ఇతర వైద్య చికిత్సలు పొందుతున్న వారికి ఎంతో ఉపయోగప డుతుందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు సేవా తత్పరతను పెంపొందించుకొని మానవతా దృక్పథంతో రక్తదానం చేయడానికి రక్తదాతలు ముందుకు రావాలని, రక్తదానం చేసి రక్తదాతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం శిబిరంలో రక్తదానం చేసిన రక్త దాతలకు జిల్లా కలెక్టర్, ఎస్టీ కమిషన్ సభ్యులు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మై భారత్ కోఆర్డినేటర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు భరత్, పి ఆర్ ఓ జీవన్ కుమార్ , వివిధ గిరిజన సంఘాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

జిల్లా ఎస్పీ పి. జగదీష్

జిల్లా వ్యాప్తంగా ఘనంగా పోలీస్ శాఖ మొక్కల పెంపకం కార్యక్రమం





**అంకుశం క్రైమ్ న్యూస్అనంతపురం ఆగస్టు 9** అనంతపురం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలోవిరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భారీ మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ తెలిపారుజిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ?ఈ సందర్భంగా వివిధ పోలీసు స్టేషన్ల ఆవరణలు, పరిసర ప్రాంతాల్లో నీడనిచ్చేవి, ఫలాలనిచ్చే మొక్కలను నాటి, వాటికి నీళ్లు పోశారు. ?"ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారుశాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతగా చేపట్టిన ఈ హరిత హారం కార్యక్రమం పోలీస్ స్టేషన్లకు నూతన శోభను ఇస్తుందని ఆయా పోలీసు అధికారులు తెలియజేశారు. ?ఆయా కార్యక్రమాలలో జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం డోర్ టు డోర్ కార్యక్రమంలో కార్యక్రమంలో ప్రజలతో మమేకమైన వద్దే సిమెంట్ పోలన్న



**అంకుశం న్యూస్,పత్తికొండ,ఆగస్టు:9:** పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నాయకత్వంలో పత్తికొండ నియోజకవర్గంలో కొనసాగుతున్న "ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమం"లో భాగంగా పత్తికొండ నియోజకవర్గ పరిశీలకుడు,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వద్దే సిమెంట్ పోలన్న ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు.ఈ సందర్భంగా ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించి,ఇంకా ప్రభుత్వ పథకాలు అందని అర్హుల వివరాలను నమోదు చేశారు.ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా వద్దే సిమెంట్ పోలన్న మాట్లాడుతూ,ఇంటింటి కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం,ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరవేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.గ్రామస్థులు తెలిపిన ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా పార్టీ శ్రేణులంతా సమిష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## హెచ్ఎల్సీ ఆధునికీకరణలో పాలకుల నిర్లక్ష్యం...

రైతుల ప్రయోజనాలను గాలికొదిలిన పాలకులు

ఆంధ్రా పరిధిలో పనులు ఎప్పుడు?.

4 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించే అవకాశం ఉన్నా పట్టించుకోని పాలకులు

సీపీఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి



**అంకుశం న్యూస్ ఉరవకొండ ఆగస్టు 9 :** నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతున్న అనంతపురం జిల్లాలో సాగునీటి వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి విమర్శించారు.హెచ్ఎల్సీ,జీబీసీ కాలువల ఆధునికీకరణ పనుల్లో జరుగుతున్న జాప్యం రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తోందన్నారు. ఆదివారం ఉరవకొండ మండలం నింబగల్లు సమీపంలో శిథిలావస్థకు చేరుకున్న హెచ్ఎల్సీ,జీబీసీ కాలువలను స్థానిక సీపీఐ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ.. హెచ్ఎల్సీ ఆధునికీకరణ పనులు కర్ణాటక పరిధిలో పూర్తయినా, ఆంధ్రప్రదేశ్ పరిధిలో మాత్రం పనులు చేపట్టకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. హెచ్ఎల్సీని పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తే సుమారు 4 వేల క్యూసెక్కుల నీటిని సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. కాలువ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రెగ్యులేటర్లు, తూములు, ఇతర కీలక నిర్మాణాలకు మరమ్మతులు చేపడితే నీటి వృథాను అరికట్టి చివరి ఆయకట్టు భూములకు సైతం సాగునీరు అందించవచ్చన్నారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్కు వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో హెచ్ఎల్సీ, జీబీసీ ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలువల శిథిలావస్థ కారణంగా నీటి విడుదల సమయంలో లీకేజీలు, ఇతర సమస్యలతో నీరు వృథా అవుతోందన్నారు. అలాగే హంద్రీనీవా కాలువ ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని తీసుకురావాలని, ఉరవకొండ నియోజకవర్గంలో సామూహిక బిందు సేద్యం ప్రాజెక్టును పూర్తి చేసి 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని కోరారు. వర్షాభావ పరిస్థితులతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి, రైతులకు తగిన ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువల ఆధునికీకరణపై ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే రైతులను ఐక్యం చేసి సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని పి.నారాయణస్వామి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేశవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లికార్జున నాయకులు సుల్తాన్, నాగేంద్ర, బసవరాజు, హుషేన్బాషా,గన్నే మల్లేష్,ప్రజానాట్యమండలి నాయకులు కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దాల నాటితాగునీటి సమస్యకు పరిష్కారం



**రాప్తాడు అంకుశం న్యూస్ ఆగస్టు 9** మండలంలోని బొమ్మేపర్తి గ్రామ పంచాయతీలో దశాబ్దాలుగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం లభించింది. గ్రామంలో బోరు, మోటారు సౌకర్యం ఉన్నప్పటికీ, ట్రాన్స్ఫార్మర్ లేని కారణంగా విద్యుత్ సరఫరా సరిగా లేక ఇన్నాళ్లూ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు ఈ సమస్యను గ్రహించిన రాప్తాడు మండల టీడీపీ ఇన్చార్జ్ ధర్మవరపు మురళి, ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, సంబంధిత విద్యుత్ అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీడీవో బి.విజయలక్ష్మి సూచన మేరకు ఆదివారం డిప్యూటీ ఎంపీడీవో అచ్చుతానంద బాబు, పంచాయతి కార్యదర్శి చల్లా ఉమాదేవి చర్యలు చేపట్టి సమస్యను నివారించడంతో గ్రామానికి నీటి సరఫరా పునరుద్ధరించబడింది.

?దశాబ్ద కాలానికి పైగా ఎదురుచూస్తున్న సమస్యను చెప్పిన వెంటనే పరిష్కరించినందుకు బొమ్మేపర్తి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీతకు, ధర్మవరపు మురళికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# అనంతలోఆగస్టు 10వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..
జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..



**అంకుశం న్యూస్అనంతపురం, ఆగస్టు 09 :** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవఎశీయిఎ.ఖజా.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

ఆగస్టు 10వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :

– ఆగస్టు 10వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీద్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు.

– ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.

# దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్





దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం
విద్య.. సేవ.. సమాజ అభ్యున్నతే ఆయనకు నిజమైన నివాళి

**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 09:** కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామంలో ఏర్పాటు చేసిన శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొమ్మేటి వెంకటరెడ్డి సేవలను స్మరించుకుంటూ ఆయనకు ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి ఎంచుకున్న బాట విద్య అన్నారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని నమ్మిన మహనీయుడని కొనియాడారు. విద్యాభివృద్ధి కోసం తనకున్న వందలాది ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప దాత, సేవా తత్పరుడని పేర్కొన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డిలోని సేవా గుణాలను నేటి తరం ఎంతైనా ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ నడిచిన ముళ్లబాటను పూలబాటగా మార్చిన మహనీయుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో విద్య, వైద్య రంగాల్లో శెట్టిబలిజ సమాజంతో పాటు అన్ని వర్గాల ప్రజలు మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఏ కులమైనా గౌరవంగా, ఆత్మగౌరవంతో నిలబడాలంటే రాజకీయంగా, ఆర్థికంగా బలంగా ఉండాలని మంత్రి సుభాష్ అన్నారు. అందుకోసం అన్ని కులాల వారు కలిసిమెలిసి, ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన సామాజిక సమరసత పిలుపును ఆదర్శంగా తీసుకోవాలని కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూసే వైసిపి పార్టీకు ప్రజలు గత ఎన్నికల్లో తగిన సమాధానం చెప్పారని అన్ని కులాలు ఏకతాటిపైకి రావాలని అన్నారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని ప్రభుత్వపరంగా అధికారికంగా ప్రకటించి ఉత్సవాలు నిర్వహించామని అలాగే రాష్ట్రంలో డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగితే వైసీపీ నాయకులు ఏదో జరుగుతున్నట్లు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సోషల్ ఇంజనీరింగ్ ద్వారా బీసీలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. గీత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈసందర్భంగావిగ్రహ దాతను అభినందించిన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ. కాకినాడ రూరల్ టీడీపీ ఇన్‌చార్జ్ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మాట్లాడుతూ..దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు శెట్టిబలిజ సమాజంతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత పాలిక శ్రీను, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పెచ్చేటి విజయలక్ష్మి, ఏపీ స్టేట్ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి,కూడా చైర్మన్ తలాటం సత్య, జడ్పీటీసీ గుబ్బల తులసికుమార్, సత్య స్కాన్ అధినేత డాక్టర్ కాదా వెంకట రమణ, టీడీపీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, మాజీ జెడ్పీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు,కాకినాడ జిల్లా శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు చొల్లంగి వేణుగోపాల్ , మాజీ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పితాని అప్పన్న,కూటమి పార్టీ నేతలు, బీసీ సంఘం అధ్యక్షులు ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న 22వ వార్డు ఇంచార్జ్ తుమ్మల అర్బాజ్



**అంకుశం న్యూస్,కదిరి,ఆగస్టు:9:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కదిరి మున్సిపాలిటీ 22వ వార్డులో లో ఇంటింటికి తెలుగుదేశం డోర్ టు డోర్ కార్యక్రమం కదిరి పట్టణ 22వ వార్డు ఇంచార్జ్ తుమ్మల అర్బాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తుమ్మల అర్బాజ్ ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో చేసిన సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి చేరవేయాలనే లక్ష్యంతో కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అర్బాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షేమ అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారని తెలియజేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఉపాధి అవకాశాలు తీసుకురావడంతోపాటు ప్రతి ఊరు ప్రతి గ్రామం అభివృదే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉమర్,దాదా పీర్,ఇర్ఫాన్,కలుమున్నీసా, అంజాద్,పాల్గొన్నారు.

## మెగా యూత్ ఫోర్స్ జిల్లా కో కన్వీనర్ గా లక్ష్మణ కుటాల,కదిరి కన్వీనర్ గా దాసరి కార్తీక్ నియామకం.



**అంకుశం న్యూస్,కదిరి,ఆగస్టు:9:** కోట్లాది మంది అభిమానుల ఆరాధ్య దైవం పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి సేవా స్పూర్తిగా పలు సేవా కార్యక్రమాలను గుర్తించి నేడు అనంతపురం నగరంలో ఉమ్మడి అనంతపురం జిల్లా కో కన్వీనర్ గా కదిరి నియోజక వర్గం కన్వీనర్ గా దాసరి కార్తీక్ ని మెగా యూత్ ఫోర్స్ సంస్థ ప్రతినిధులు నియామక పత్రాలను అందించారు.మెగా ఫ్యామిలీ కోసం మరింత శ్రమించి వారి సేవా స్పూర్తిని కొనసాగిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రేమే లక్ష్యం సేవే మార్గం న్నట్లుగా కృషి చెయ్యాలని ఉమ్మడి అనంతపురం జిల్లా మెగా యూత్ ఫోర్స్ ప్రతిందులు ఆకాంక్షించారు.తమపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన కొణిదెల సుస్మిత కి జాతీయ కన్వీనర్ ఏడిద బాబీ జిల్లా కన్వీనర్ ఇమామ్ హుస్సేన్ ,రాయలసీమ కన్వీనర్ చక్రి,జిల్లా జాయింట్ కన్వీనర్ బోయగడ్డ బ్రహ్మయ్య రాష్ట్ర,జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లో మెగా ఫ్యామిలీ పేరుతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని లక్ష్మణ, కార్తీక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్వచ్ ఆంధ్ర డైరెక్టర్ అఖిల భారత చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షులు భవాని రవి కుమార్,సీనియర్ అభిమానులు అంగడి చలపతి , కాయగూరల లక్ష్మీ ప్రసాద్,చంద్రమౌళి జిల్లా,నియోజకవర్గ కమిటీ కన్వీనర్లకు తమ అనుభవాలను తెలుపుతూ నియామక పత్రాలను అందించారు.

## జాతీయ ఆదివాసీ గిరిజన దినోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గిరిజన రాష్ట్ర నాయకుడు సోమ్లా నాయక్



**అంకుశం న్యూస్,అనంతపురం,ఆగస్టు:9:** గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా గిరిజన హక్కుల పరిరక్షణే ధ్యేయంగా గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న అండదండలను ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా అనంతపురం గిరిజన భవన్‌లో అనంతపురం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జాతీయ ఆదివాసీ గిరిజన దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు సభావత్ సోమ్లా నాయక్,ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా సభావత్ సోమ్లా నాయక్ గిరిజనుల సమస్యలను,వారి హక్కులను,ప్రభుత్వం ద్వారా గిరిజనులకు అందాల్సిన సంక్షేమ పథకాలను స్పష్టంగా ప్రస్తావించారు.ముఖ్యంగా గిరిజనులకు అందాల్సిన సబ్సిడీ రుణాలు,ఆర్థిక సహాయం,ఉపాధి అవకాశాలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.గిరిజనుల సమస్యలను కేవలం సభలకే పరిమితం చేయకుండా,వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేయాలనే సంకల్పంతో ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులుగా సభావత్ సోమ్లా నాయక్ చేస్తున్న కృషి అభినందనీయం.గిరిజనుల గొంతుకగా వారి సమస్యలను సమర్థవంతంగా వినిపించడం ద్వారా గిరిజన సంక్షేమం పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి,విద్య, ఉపాధి,ఆర్థిక స్వావలంబన,సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు గిరిజన సమాజానికి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయి.అలాగే ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప ఎస్సీ,ఎస్టీలపై జరిగే దాడులు,ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం,బాధితులకు అందాల్సిన న్యాయం చట్టపరమైన రక్షణ వంటి అంశాలపై మాట్లాడారు.గిరిజన సంఘం నాయకులు శివ శంకర్ నాయక్ గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు,విద్యా రంగంలో వారికి అందాల్సిన సౌకర్యాల గురించి వివరించారు.గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్ నాయక్ గిరిజన కో-ఆపరేటివ్ రంగం ద్వారా గిరిజనులకు అందుతున్న అవకాశాలు,ఆర్థిక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి,సాకే వీరాంజనేయులు,బంజారా కులవృద్ధుడు కేశవ నాయక్,టీటీడీ మాజీ బోర్డు సభ్యులు అస్వర్త నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ అది వాసి దినోత్సవం



**అంకుశం న్యూస్ ధర్మవరం ఆగస్టు 9** "ప్రపంచ ఆదివాసీ దినోత్సవం"సందర్భంగా శ్రీ.సత్యసాయిజిల్లా, ధర్మవరం పట్టణంలొ కేతిరెడ్డి కాలని(రా4),"వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ", యస్టి సెల్‌దిరాష్ట్ర సంయుక్త కార్యదర్శిదిదేవరకొండ రమేష్ ఆధ్వర్యంలో"(ఎరుకుల)"కుటుంబాలు,"కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొన్నారు", ఈ సందర్భంగా దేవరకొండ రమేష్ మాట్లాడుతూ, ఆదివాసీయులు(గిరిజనులు)అడవులలో పుట్టి పెరిగి,పులులు-సింహాలమధ్య పెరిగి ఎంతో"ధైర్య వంతులని",నేడు ప్రపంచంలో కళాకారుల కళాత్మకతకు"జీవం(ప్రాణం)పోసిందే"ఆదివాసి గిరిజనులని,కలియుగదైవం"శ్రీ. వెంకటేశ్వర స్వామికి "భవిష్యత్తును చెప్పిన వంశమని కొనియాడారు.ఈ కార్యక్రమంలొది దేవరకొండ రమేష్,దేవరకొండ లక్ష్మీ నరసింహులు, సాకే లక్ష్మీనారాయణ,దేవరకొండ ప్రేమ్ కుమార్,సాకే గంగాధర్,దేవరకొండ కుళ్లాయప్ప,సాకే పెద్దన్న,కుమార్,గుజ్జల ముత్యాలు,దేవరకొండ ప్రత్యూష,దేవరకొండ రాధమ్మ,సాకే ఉమాదేవి,గుజ్జల గంగమ్మ,దేవరకొండ కుమారి,సాకే రత్నమ్మ,సాకే ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా తెలుగుదేశం గ్రామాల్లో చైతన్యం!



**అంకుశం న్యూస్ ధర్మవరం ఆగస్టు 9** రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన లో సాధించిన ప్రగతి గురించి వివరిస్తూ ధర్మవరం నియోజకవర్గం లోని పలు గ్రామాలలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం తో గ్రామాలలో చైతన్యం వెల్లి విరిసింది. ధర్మవరం మండలం గొట్లూరు లో జరిగిన ఈకార్యక్రమం లో సీనియర్ టీడీపి నాయకులు గొట్లూరు శ్రీ నివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు గ్రామాలలో అత్యంత ఆదరణ పొందయన్నారు. ఈ కార్యక్రమం లో టీడీపి నాయకులు యూ. నారాయణ స్వామి టీడీపి కార్యకర్తలు నాయకులు పలువురు టీడీపీ మహిళలు పాల్గొని విజయవంతం చేశారు

## ఆదర్శ రైతు సేవా భావం



**అంకుశం న్యూస్ ధర్మవరం ఆగస్టు 9** ధర్మవరం మండలం సుబ్బారావు పేట గ్రామం ఆదర్శ రైతు గొట్లూరు చంద్ర శేఖర్ రెడ్డి పంటలు పండిశీచడం లో నే కాదు సేవా భావం లో కూడా మిన్న అని అనిపించుకున్నారు.మండలం లోనే వున్న గొట్లూరు అనాధ ఆశ్రమం కు తన వంతు సాయం గ్ర్ష c తన ముద్దుల కుమారుడు జి. రుషిత రెడ్డి జన్మదినశీ సందర్భంగా ఆశ్రమానికి, బియ్యం,వంట సరుకులు అందజేసి తన దాతృత్వం నిలబెట్టుకున్నారు..వీరిని పలువురు మనసారా అభినందించారు.తల్లి తండ్రులు శ్రీ మతి విమల, చంద్ర శేఖర్ రెడ్డి దంపతులకు ఆశ్రమం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.